క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు



నూతనంగా నిర్మించిన హనుమంతుని ఆలయం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బీఉప్పలూరులో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 31న విగ్రహ ప్రతిష్ఠ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు మంగళవారం తెలిపారు. దాతల సహకారంతో గర్భగుడి, ముఖ మండపం నిర్మాణం చేశామన్నారు. వేదపండితుడు ఆలూరు రాఘవేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం ధ్వజస్తంభం, అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందన్నారు.

నేటి నుంచి హనుమజ్జయంతి వేడుకలు



వీరాంజనేయస్వామి

అవుకు: నిచ్చెనమెట్ల గ్రామంలో బుధవారం నుంచి హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. రెండు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 21వ తేదీ రాత్రి 8గంటలకు వీరాంజనేయస్వామి దేవస్థానంలో శ్రీరామ భజన, 22వ తేదీ ఉదయం శ్రీరామచంద్రమూర్తికి, వీరాంజనేయస్వామి వారికి ఆకుపూజ, విశేష అలంకరణ, దూప, దీప, నైవేద్య సమర్పణ ఉంటుందన్నారు. అదే రోజు సాయంత్రం 4గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలతో స్వామివారి పల్లకీ సేవ జరుగుతుందన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో ఉద్యానశాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ సచివాలయ ఆవరణలో ఉద్యానశాఖ అధికారి రఘువరన్, సర్పంచ్ శ్రీరాములు, ఏపీఓ విజయరాణి ప్రభుత్వం ఆయిల్ పామ్ తోటలకు అందిస్తున్న రాయితీలు, ప్రయోజనాలను వివరించారు. ఉద్యానశాఖ సహాయకులు రాజు నాయక్, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.


ఘనంగా ఖాజా బందేనవాజ్ ఉరుసు



గుర్రంపై షంషేర్ ఊరేగింపు

ప్యాపిలి: పట్టణంలోని వెంకటరెడ్డి కాలనీలో వెలసిన హజరత్ ఖాజా బందేనవాజ్ స్వామి ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మంగళవారం స్వామి వారి షంషేర్‌ను గుర్రంపై ఉంచి పట్టణ వీధుల మీదుగా గ్రామోత్సవం నిర్వహించారు. పట్టణ ప్రజలు కులమతాలకు అతీతంగా స్వామికి చెక్కెర చదివింపులు సమర్పించారు. అనంతరం దర్గా ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక ఫాతెహా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యలపై వినతి



అంబాపురం సచివాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

బేతంచెర్ల: రైతులు, కౌలు రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు అన్నారు. మంగళవారం బేతంచెర్లతో పాటు అంబాపురం, రంగాపురం, గూటుపల్లె, గోర్లగుట్ట గ్రామ సచివాలయాల ఎదుట ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి రామ్ మోహన్ ఆధ్వర్యంలో రైతులు నిరసన తెలిపారు. సకాలంలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. బ్యాంకు రుణాలు అందజేయాలని కోరారు. అనంతరం డిమాండ్లను పరిష్కరించాలని ఆయా సచివాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు.

25న వేంకటేశ్వరుని కల్యాణం

బేతంచెర్ల: స్థానిక దుర్గాపేట కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 25వ తేదీ శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు మద్దయ్య తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు ఉంటాయని చెప్పారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

నాడు కళకళ.. నేడు వెలవెల


- ప్రాభవం కోల్పోయిన పురాతన బావులు
- నాడు గ్రామాలకు బావుల నీరే ఆధారం
- అభివృద్ధిని పట్టించుకునే నాథుడు కరువు



ముద్దవరంలో చెక్కు చెదరని చేదుడు పురాతన బావి



బేతంచెర్ల బైటిపేటలో నీటితో ఉన్న బావి,



ఎం.పెండేకల్లు గ్రామంలో రాతి కట్టడ బావి

బేతంచెర్ల: ఒకప్పుడు ఊరందరూ ఆధారపడిన బావులు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. విద్యుత్ సౌకర్యం అందుబాటులో లేని కాలంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీరు అందించిన ఈ బావులు దుస్థితికి చేరుకున్నాయి. విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి రావడంతో బావుల స్థానాలను బోరు బావులు భర్తీ చేస్తున్నాయి. గ్రామస్తుల నీటి అవసరాలు తీరుతున్నాయి. నాటి చరిత్రకు ఆనవాలుగా ఉన్న ఈ బావుల అభివృద్ధిపై ఎవరూ దృష్టి సారించకపోవడంతో నాడు కళకళలాడిన బావులు నేడు వెలవెలబోతున్నాయి. చెత్త దిబ్బలుగా దర్శనమిస్తున్నాయి.

నాడు పదిలం.. నేడు శిథిలం

మండలంలోని ముద్దవరం, ఎం.పెండేకల్లు, బేతంచెర్లలోని బైటిపేటలో పురాతన బావులు నాటి కళా నైపుణ్యాలకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. నాడు గ్రామాల్లో చేదుడు బావులు, మెట్ల బావులు తాగు నీటి అవసరాలు తీర్చేవి. నిత్యం గ్రామస్తులతో సందడిగా కనిపించే బావులు నేడు మట్టి దిబ్బలుగా మారిపోయాయి. నాటి చరిత్రకు, కళానైపుణ్యానికి ఆనవాలుగా ఉన్న బావులను నేడు పట్టించుకునే నాథుడే లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ప్రభుత్వం భూగర్భజలాల పెంపు కోసం పంట పొలాల గట్ల వెంట కుంటలు, చెరువుల్లో పూడికతీత పనులు చేయిస్తోంది. అలాగే పూరాతన బావులను అభివృద్ధి చేస్తే విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు, బోరు బావుల్లో భూగర్భజాలాలు ఇంకిపోయినప్పుడు గ్రామీణ ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చే అవకాశం ఉంది. చరిత్ర కలిగిన కట్టడాలను సంరక్షించి భవిష్యత్తు తరాలకు అందించినవారమవుతామని పలువురు పేర్కొంటున్నారు.

బావులను అభివృద్ధి చేయాలి



నాటి కళా నైపుణ్యాలకు సాక్ష్యంగా ఉన్న బావులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పూర్వం రాజులు ప్రజల తాగునీరు, సాగు నీటి అవసరాల కోసం బావులు, చెరువులు తవ్వించారు. నాటి చారిత్రక కళా వైభవానికి ఆనవాలుగా ఉన్న బావులను సంరక్షిస్తే భూగర్భజలాలు పెరగడమే కాకుండా అత్యవసర వేళ్లలో తాగునీటి సమస్య తీరే అవకాశం ఉంది. –నాగేశు, ఆర్ఎస్ రంగాపురం

భూగర్భ జాలాలు పెరుగుతాయి



ప్రభుత్వం భూగర్భజలాల పెంపు కోసం చెక్‌డ్యాములు, పంట పొలాల్లో పంట కుంటలు, చెరువుల్లో పూడికతీత పనులు చేయిస్తోంది. అలాగే పూరాతన బావులను సంరక్షిస్తే తాగునీరు అందించే బోరుబావుల్లో భూగర్భజాలలు పెరిగే అవకాశం ఉండడమే కాకుండా నాటి బావులను సంరక్షించిన వారం అవుతాం. –మూర్తుజావలి, బేతంచెర్ల

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

సంజామల: రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ సాల్మన్ అన్నారు. ముఖ్యంగా మట్టి మిద్దెల్లో ఉంటున్న వారు, శిథిలావస్థకు చేరుకున్న ఇంట్లో నివాసం ఉంటున్న వారు జాగ్రత్తగా ఉండాలని.. సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అవసరమైతే తప్ప బయటకు రావద్దన్నారు. ఏవైనా సమస్యలు, ఇబ్బందులు ఎదురైతే వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు.

రైతులతో చర్చలకు ఏర్పాట్లు

కొలిమిగుండ్ల: కల్వటాలతో పాటు చుట్టు పక్కల గ్రామాల రైతులు, రామ్‌కో సిమెంట్ కంపెనీ ప్రతినిధులతో చర్చించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం రైతులు పుల్లయ్య, పెద్దయ్య, గోపాల్‌రెడ్డి తదితరులు తహసీల్దార్ బాల ఈశ్వర రెడ్డిని కలిశారు. వారం క్రితం సీపీఐ నాయకులు కలిసిన సమయంలో ఇచ్చిన మాట ప్రకారం తహసీల్దార్ కంపెనీ ప్రతినిధులతో చర్చలకు ఏర్పాటు చేశారని రైతులు పేర్కొన్నారు. కాగా సిమెంట్ ఫ్యాక్టరీ వాహనాల వల్ల దుమ్ము,ధూళితో పంటలకు నష్టం జరుగుతోందని రైతులు వాపోతున్నారు. చర్చలో నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని యాజమాన్యాన్ని కోరుతామన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

డోన్: ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు మధుకుమార్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని పాతబస్టాండ్, హమాలీకట్ట, శేగు థియేటర్ తదితర ప్రాంతాల్లో కళాజాత బృందాలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాయి. హెచ్ఐవీ సంక్రమించే మార్గాలు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందుబాటులో ఉన్న చికిత్స విధానాలు, కేంద్రాలు, బాధితులకు ప్రభుత్వం నుంచి అందే సాయం తదితర విషయాలను వివరించారు.



పాతబస్టాండ్ వద్ద అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

కార్యక్రమంలో కళాజాత సభ్యులు విశ్వరాజు, సరస్వతి, షాజహాన్, సోఫియా, సలీమా, వనిత, రాజీ, మౌనిక, బాషా పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



జిల్లా కమిటీ సభ్యులను సత్కరిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

కోవెలకుంట్ల: వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రఘుబాబు అన్నారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మంగళవారం కోవెలకుంట్ల తాలుకా కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్త్ ఉద్యోగులకు ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, గ్రేడ్–3 ఏఎన్ఎంలను పూర్తిగా మెడికల్, హెల్త్‌శాఖ పరిధిలోకి తీసుకురావాలన్నారు. వైద్యశాఖలో ఏళ్ల తరబడి విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు బదిలీల్లో అవకాశం కల్పించాలని, వారికి వంద శాతం గ్రాస్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కర్నూలు జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సయ్యద్ షఫీ, సందీప్, త్యాగరాజు, నాగన్న, సంజన్న, సుదర్శన్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, విష్ణువర్ధన్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కమిటీల నియామకం

డోన్ టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు డోన్ మండల, మున్సిపాలిటీ కమిటీలను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం పేర్లు విడుదల చేసింది. డోన్ మండల కమిటీ ఉపాధ్యక్షులుగా గడ్డం సుధాకర్‌రెడ్డి, పాస్మాని తిమ్మయ్య, జనరల్ సెక్రెటరీలుగా కురువ నాగేశ్వరావు, పి.శేషిరెడ్డి, గొల్ల మదన్, ఆర్. శ్రీనివాసరెడ్డి, సెక్రెటరీలుగా షేక్ అల్లాభకాష్, ఎస్.ప్రభాకర్, పి.బాలు, బొబ్బల శివరామిరెడ్డి, మల్యాల శ్రీనివాసరెడ్డితో పాటు 13 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లను నియమించారు. అలాగే మున్సిపాలిటీ కమిటీ ఉపాధ్యక్షులుగా మిట్టా రవి కుమార్, క్వాలిటీ అబ్దుల్లా, జనరల్ సెక్రెటరీలుగా చంద్రోశేఖర్, టీఈ రఘుగౌడ్, దారా ప్రతాప్‌రెడ్డి, సత్తి రాజశేఖర్, సెక్రెటరీలుగా సోమ నాగిరెడ్డి, శ్యామ్ (జాకోపాల్), మేకల రాజు, కటికె మహేశ్వరరావు, మహబూబ్ బాషాతో పాటు మరో 22 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బేతంచెర్ల కమిటీ నియామకం

బేతంచెర్ల: వైఎస్సార్‌సీపీ బేతంచెర్ల మండలం, నగర పంచాయతీ కమిటీ సభ్యులను ప్రకటించారు. మండల ఉపాధ్యక్షులుగా జగడాల పురుషోత్తం, ఎస్.నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీలుగా పి. చంద్రోశేఖర్ రెడ్డి, యు. మల్లికార్జున, పి.ఎద్దులన్న, ఎం.తిమ్మరాజు, సెక్రటరీలుగా బండి రమణారెడ్డి, కె.శివరామిరెడ్డి, ఎర్రమల సురేష్, పీర్ సాహెబ్, ఆర్. సుబ్రమణ్యంతో పాటు మరో 36 మందిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమించారు. అలాగే బేతంచెర్ల నగర పంచాయతీ పార్టీ కమిటీ ఉపాధ్యక్షులుగా అడపాల తిరుమలేష్, కటారు కొండ మద్దిలేటి, జనరల్ సెక్రటరీలుగా షేక్ మహమ్మద్ ముస్తఫా, గూని నాగేశ్వరరావు, డి. నూర్ కమాల్, యు. భాస్కర్, సెక్రటరీలుగా ఎం. రఘు రామిరెడ్డి, కె.నాగేంద్ర, పి. శ్రావణ్ కుమార్, బొల్లి రమేష్, తలారి రామనాయుడుతో మరో 20 మందిని ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా నియమించారు.

ప్యాపిలి మండల కమిటీ

ప్యాపిలి: వైఎస్సార్‌సీపీ ప్యాపిలి మండల ఉపాధ్యక్షులుగా కొండయ్య, నరసింహారెడ్డి, జనరల్ సెక్రెటరీలుగా జమాల్ సాహెబ్, దివాకర్ రెడ్డి, పిక్కిలి పాండు, బాల వెంకటేశ్వర్లు, సెక్రెటరీలుగా అమర్‌నాథ్ రెడ్డి, పోగుల రమేష్, శ్రీరాములు, బాలాంజి, ఎర్రిస్వామి తదితరులను నియమించారు. అలాగే 33 మందిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమించారు.

మెమో ఇచ్చినా మారని తీరు


ప్యాపిలి: మండల పరిధిలోని వెంగళాంపల్లిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డు అసిస్టెంట్ రమేశ్‌కు అధికారులు మెమో ఇచ్చినప్పటికీ తన తీరు మార్చుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పనుల వద్ద ఉన్న కూలీలకు మస్టర్‌లో ఉన్న హాజరుకు తేడా ఉండడంతో ఈ నెల 17న అధికారులు ఫీల్డు అసిస్టెంట్‌కు మెమో ఇచ్చారు. అయితే మంగళవారం చేపట్టిన పనుల్లో కూడా ఫీల్డు అసిస్టెంట్ మస్టర్లలో తప్పుడు హాజరు నమోదు చేశారు. పనులకు 280 మంది హాజరైతే దాదాపు 380 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ఇది వరకే ఫొటోలు దిగిన కూలీలను వేర్వేరు స్థానాల్లో నిల్చోబెట్టి ఎక్కువ మంది ఉన్నట్లు ఫొటోలు తీసుకుని మస్టర్‌లో నమోదు చేశాడు. పనులకు వెళ్లిన కూలీలు ఉపాధి వేతనాల నుంచి రూ.200 అక్రమంగా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే పనులకు వెళ్లని వారి పేర్లు మస్టర్లలో నమోదు చేసినందుకు గాను వారికి వచ్చిన వేతనాల్లో సగం వేతనాలు ఫీల్డు అసిస్టెంట్ వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఫొటోలో ఇద్దరు ఉంటే ముగ్గురికి వేసిన హాజరు

ఎన్టీఆర్ అభిమానుల సేవా కార్యక్రమాలు

డోన్ టౌన్: సినీ నటుడు ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఆయన అభిమానులు వృద్ధాశ్రమాలు, ఆస్పత్రుల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఎన్‌బీకే ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు మంగలి నగేష్, సురేంద్రగౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కటౌట్‌కి పూలమాలలు వేసి బాణాసంచా కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు. అన్నదానం చేశారు. అలాగే ఎన్టీఆర్ సేవా సమితి అధ్యక్షుడు కలచట్ల చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, కార్యదర్శి విజయ్‌కుమార్ నాయుడు పండ్లు, బ్రెడ్లు, అల్పాహారం అందించారు.



అన్నదానం చేస్తున్న అభిమానులు

విమర్శించడమే టీడీపీ నాయకుల పని

- తిట్టడానికి వేదికగా మినీ మహానాడు
- వారికి అభివృద్ధి, సంక్షేమం చేతకాదు
- వైఎస్సార్‌సీపీ నాయకుల ఎద్దేవా



మాట్లాడుతున్న రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకులు

డోన్: ఇటీవల డోన్‌లో జరిగిన మినీ మహానాడు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించేందుకు నిర్వహించారే తప్ప ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం ఏం సాధించిందో ప్రజలకు సమాధానం చెప్పలేక పోయారని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మురళీకృష్ణ, వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుప్రసాద్ అన్నారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో మంగళవారం పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని మినీ మహానాడులో బేతంచెర్ల టీడీపీ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి అసభ్య పదజాలంతో దూషించడం సహించరాని విషయమన్నారు. ఆదర్శమైన కుటుంబం నుంచి వచ్చిన ఆమె మాజీ మంత్రిని వ్యక్తిగతంగా దూషించడం ఆక్షేపణీయమన్నారు. సభ్యత, సంస్కారం మరిచి సంస్కార హీనురాలిగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగాపురం మద్దిలేటి స్వామి దేవస్థానంలో కళ్యాణ మండపం నిర్మించి సొంతంగా అద్దె వసూలు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఆలయ ఆవరణలో నిర్మించిన సత్రాలు, కళ్యాణ మండపాలన్నీ దేవునికే చెందిన ఆస్తిగా పరిగణిస్తాం తప్ప ప్రసన్నలక్ష్మి సొంత ఆస్తిగా ఎలా భావిస్తారని తిరుమలేశ్వరరెడ్డి అన్నారు.

'వలస' పక్షి

టీడీపీ రాష్ట్ర నాయకుడిగా చెప్పుకుంటున్న వలసల రామక్రిష్ణ నైతిక విలువలు లేని వ్యక్తి అన్నారు. కన్న తల్లి లాంటి సీపీఐకే వెన్నుపోటు పొడిచిన నీచుడని, ఇప్పటికే కాంగ్రెస్, టీడీపీ, జనసేన, ప్రజారాజ్యం లాంటి అనేక పార్టీలు మారి ఏ ఎండకు ఆ గొడుగు పట్టాడన్నారు. తల్లి పాలు తాగి రొమ్ము గుద్దే రకం అని విమర్శించారు.

అభివృద్ధి చేయడమే నేరమా?

మోడల్ నియోజకవర్గంగా డోన్‌ను తీర్చిదిద్దిన ఘనత బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఐదేళ్ల కాలంలో రెండేళ్లు కరోనాతో కరిగిపోగా మిగిలిన మూడేళ్లలో రూ.3 వేల కోట్లతో నియోజకవర్గాన్ని విద్య, వైద్య, క్రీడా, పర్యాటక, తాగు, సాగునీటి రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో కూటమి నాయకులు నియోజకవర్గంలో రూ.3వేల కోట్లకు ఒక్క రూపాయి అదనంగా మంజూరు చేయించినా తాము రాజకీయ సన్యాసం తీసుకుంటామని సవాల్ చేశారు.

రూ.100 కోట్లు ఎక్కడ?

డోన్ మున్సిపాలిటీకి రూ.100 కోట్లు మంజూరు చేయించామని టీడీపీ నాయకులు ప్రజలను మభ్యపెడుతున్నారని శ్రీరాములు ఆరోపించారు. సీఎం రూ.100 కోట్లు మంజూరు చేశారంటూ ఏడాది కాలంగా వారు చేస్తున్న ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయన్నారు. జగనన్న కాలనీలో 5వేల మందికి ఇంటి స్థలాలు ఇప్పించి గృహాలు నిర్మించినా కూటమి ప్రభుత్వం కనీసం డ్రైనేజీ, రోడ్లు ఏర్పాటు చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. రూ.228 కోట్లతో హంద్రీ–నీవా కాల్వ నీటి ద్వారా చెరువులు నింపే కార్యక్రమాన్ని గత ప్రభుత్వం 90 శాతం పూర్తిచేయగా, మిగిలిన 10 శాతాన్ని కూటమి ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వానికి ప్రకటనలు చేయడం తప్ప ఆచరణ చేతకాదన్నారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, పార్టీ నాయకులు పిట్టల జాకీర్, జాకీర్‌హుసేన్, సోమేష్‌యాదవ్, కురుకుంద హరి, రాజవర్ధన్, గజేంద్రారెడ్డి, లక్ష్మయ్య, వడ్డె రంగస్వామి, మల్యాల శ్రీనివాసరెడ్డి, రాజా మహేశ్వరరావ్, వెంగల్‌రెడ్డి, వెంకటేష్, రఫి, శేఖర్ యాదవ్, రవి, సురేష్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

డోన్ టౌన్: ప్రయాణికుల సమస్యలు, సలహాలు తెలుసుకునేందుకు బుధవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9959225795 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదులు, సమస్యలను తెలయజేయవచ్చని పేర్కొన్నారు. విచారించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

రేపు ప్రశ్నోత్తర రత్నమాలిక గ్రంథావిష్కరణ

బనగానపల్లె రూరల్: పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న హట్టిమునిస్వామి ఆశ్రమంలో జరుగుతున్న సత్రయాగం సందర్భంగా ఈ నెల 22వ తేదీ(గురువారం) ప్రశ్నోత్తర రత్నమాలిక గ్రంథావిష్కరణ ఉంటుందని నిర్వాహకులు మంగళవారం తెలిపారు. డాక్టర్ బి.రామాచార్యులు రచించిన శంకరాచార్యుల వారి ప్రశ్నోత్తర రత్నమాలిక గ్రంథావిష్కరణ, పురాణ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ రామశేషయ్య ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నట్లు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం

కోవెలకుంట్ల: స్థానిక ముదిగేడు చౌరస్తాలో నివాసం ఉంటున్న ఓ వృద్ధుడు అదృశ్యమైనట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం ఎస్ఐ అందించిన సమాచారం మేరకు.. కాలనీలో నివాసం ఉంటున్న సుబ్బారెడ్డి అనే వృద్ధుడు ఈ నెల 14వ తేదీ సాయంత్రం వాకింగ్‌కు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్లకు వెళ్లి ఉంటాడని కుటుంబ సభ్యులు ఆరా తీశారు. ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. వృద్ధుడి కుమార్తె పద్మజ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బాలికలు ఎందులోనూ తక్కువకాదు

డోన్: బాలికలు ఎందులోనూ తక్కువ కాదని.. అన్ని రంగాల్లో రాణిస్తున్నారని.. వాటి వ్యక్తిత్వ వికాసంపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని సీడీపీఓ శంషాద్ బేగం అన్నారు. పట్టణంలోని తారకరామనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. లైంగిక వేధింపులు, పోక్సో చట్టం తదితర అంశాల గురించి వివరించారు. ప్రతి ఇంట్లో మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలను చదివించాలని సూచించారు. ఆడపిల్లలకు 18ఏళ్లు నిండిన తరువాతనే పెళ్లి చేయాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని కోరారు. చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు దర్గయ్య, శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పరమేశ్వరి, శోభారాణి, క్రిష్ణ పాల్గొన్నారు.



బాలికల తల్లులతో మాట్లాడుతున్న సీడీపీఓ

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాతలకు ప్రశంసా పత్రం అందజేస్తున్న సీఐ

బనగానపల్లె రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూప్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో ఎందరో సరైన సమయానికి రక్తం లభించక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయన్నారు. యువత సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. శిబిరంలో 50 మంది రక్తదానం చేశారు. అనంతరం వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటానికి నివాళుల ర్పించారు. రక్తదాతలకు సీఐ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు.

కార్మిక హక్కులను కాలరాస్తే సహించం

కోవెలకుంట్ల/బేతంచెర్ల/డోన్‌టౌన్: కార్మిక హక్కులను కాలరాస్తే సహించేది లేదని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు ధ్వజమెత్తారు. కార్మికులకు నష్టం కలిగిస్తున్న నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం ఆయా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట కార్మిక సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు.

అందరి భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి

- అధికారులు బాధ్యతతో పనిచేయాలి
- కోవెలకుంట్ల మండలమీట్‌లో ఎంపీపీ రమాదేవి

కోవెలకుంట్ల: అందరి సహకారంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని.. ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలని ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రెవెన్యూ శాఖపై చర్చకు రాగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బియ్యం, చక్కెర, జొన్నలు, కందిపప్పు, రాగులు, తదితర నిత్యావసర సరుకులు అందేవని, ప్రస్తుతం బియ్యం, చక్కెర మాత్రమే ఇస్తున్నారని మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్ సభ దృష్టికి తెచ్చారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వేసవిలో సైతం వర్షాలు కురుస్తుండడంతో మేజర్ గ్రామ పంచాయతీలో రాత్రి సమయాల్లో దోమలు అధికమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మండల కో ఆప్షన్ మెంబర్ దిల్కాబాషా సభలో ప్రస్తావించారు. గ్రామ పంచాయతీ అధికారులు దోమల నివారణకు కాలనీల్లో ఫాగింగ్ చేయడం లేదన్నారు. ఆధార్, రేషన్‌కార్డుల్లో చిన్నపాటి తప్పులు ఉండడంతో ఇళ్లస్థలాలు, పక్కాగృహాలు మంజూరు కాక నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి

సమస్యల పరిష్కారానికి కృషి

గ్రామాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీపీ తెలిపారు. తాగునీరు, సీసీరోడ్లు, డ్రెయినేజీ, తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అధికారులు బాధ్యతతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. వేసవికాలం కావడంతో గ్రామాల్లో పశువులు, గొర్రెలు, మేకలకు దాహార్తి తీర్చేందుకు నీటి తొట్లు ఏర్పాటు చేశారని, ప్రతి రోజు తొట్లలో నీరు ఉండేలా పంచాయతీ కార్యదర్శులు చొరవ చూపాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మమ్మ, ఎంపీడీఓ వరప్రసాదరావు, సర్పంచ్ మెట్ల సరళ, పంచాయతీరాజ్ ఏఈ చెంచయ్య, మండల వ్యవసాయాధికారి నిరంజన్, ఉపాధి పథక ఏపీఓ శ్రీకళ, డిప్యూటీ ఎంపీడీఓ ప్రకాష్‌నాయుడు, పశువైద్యాధికారి కృష్ణకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు చంద్రమ్మ, సుగుణ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.